# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 17 అక్టోబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 68

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

## ఇప్పుడు ఇసికి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

డబుల్, ట్రిపుల్ ఎంట్రీలతో ఓటరు జాబితాలో ఒకే ఫొటో భిన్నంగా కనిపిస్తోంది. అంటే ఫొటోను తీక్షణంగా చూస్తే తప్ప గుర్తుపట్టలేని స్థితి. సీరియల్ నంబరు వేరుగా ఉండడంతో పోలింగ్ రోజున డబుల్ ఎంట్రీల ఓట్లను ఇతర వ్యక్తులతో వేయించే అవకాశముంది. ఇతర నియోజకవర్గాల వారికి ఓటు హక్కు కల్పించడంతో వారు కూడా ఇక్కడ ఓటేసే వీలుంది. ఇవన్నీ ఇటీవల నమోదు చేసుకున్నవే కావడం గమనార్హం. ఖైరతాబాద్, సనత్‌నగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల వారి పేర్లను భారీగా చేర్పించారు. దీంతో ఒకే ఇంటి నంబరుపై దాదాపు 49 ఓట్లున్న విషయం వెలుగు చూసింది. కృష్ణానగర్‌లోని ఒక గ్రూప్ హౌస్‌లో 23 మంది ఉంటే 49 ఓట్లు నమోదయ్యాయి.



- కొనుగోలు సమయంలోనే సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత
- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో స్థానిక రిజర్వేషన్లు 50 శాతానికి పెంపు
- మెట్రో రైలుపై అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీ
- రాష్ట్రంలో హ్యామ్ విధానంలో రూ.10,547 కోట్లతో.. 5,566 కి.మీ. రోడ్ల నిర్మాణం

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత.

స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి గత ప్రభుత్వంలో ఇద్దరు పిల్లల నిబంధన ఉండేది. అంతకు మించి సంతానమున్న వారు పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనపై మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో.. ఈ గరిష్ఠ నిబంధనను అమలుచేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

హైదరాబాద్: వర్షాకాలం పంట దిగుబడిలో ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. కొనుగోలు సమయంలోనే సన్నవడ్లకు రూ.500 బోనస్ కూడా చెల్లించాలని తీర్మానించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశమైన మంత్రివర్గం పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ మినహా మిగిలిన మంత్రులందరూ హాజరయ్యారు. సమావేశం అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. "ఈసారి వర్షాకాలంలో కనీవినీ ఎరుగని రీతిలో వరిపంట దిగుబడి రాబోతోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. 1.48 కోట్ల టన్నుల ధాన్యాన్ని రైతన్నలు పండించారు. దేశంలో ఇప్పటి వరకూ ఏ రాష్ట్రంలో కూడా.. ఆనాటి ఉమ్మడి ఏపీలో సైతం ఇంత పెద్దఎత్తున వరి దిగుబడి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కృషి ఇందులో కనిపిస్తుంది. ఈ సీజన్‌లో 80 లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని సేకరించాల్సి ఉంది. కేంద్రాన్ని సంప్రదించినప్పుడు.. 50 లక్షల టన్నులు మాత్రమే తీసుకోగలమని తెలిపింది. కనీసం మరో 15 లక్షల టన్నులు తీసుకోవాలని మన అధికారులు అభ్యర్థించారు. కేంద్రం సహకరించినా.. సహకరించకపోయినా.. రైతు పండించిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు క్యాబినెట్ ఆదేశాలు జారీచేసింది. కొనుగోలు కేంద్రాల వద్ద రెవెన్యూ, పౌర సరఫరా, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి.. మద్దతు ధరతో పాటు.. సన్నధాన్యానికి బోనస్ రూ.500 వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని మంత్రివర్గం తీర్మానించింది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, ప్రతి కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.మెట్రో రైలుపై సుదీర్ఘ చర్చ...హైదరాబాద్ మెట్రో రైలుపై క్యాబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. మెట్రో 2 ఎ, 2 బి విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను.. పీపీపీ మోడల్‌లో నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై దీర్ఘంగా

చర్చించింది. స్వాధీనంలో ముడిపడిన అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఛైర్మన్‌గా.. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అడ్వయిజర్ సభ్యులుగా ఈ కమిటీలో ఉంటారు. కమిటీ.. నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి అందిస్తుంది. మంత్రివర్గ ఉపసంఘం చేసే సిఫార్సుల ఆధారంగా మెట్రోను ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.

# బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు



- న్యాయనిపుణులతో చర్చించి ముందుకు
- స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత
- కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు
- మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో
- కేబినేట్ సబ్‌కమిటీ డిసెంబరు 1 నుంచి 9 వరకు
- ప్రజాపాలన విజయోత్సవాలు
- తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయలు...
- హాజరు కాని కొండా సురేఖ




# బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట

- స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం తిరస్కరణ
- పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచన
- హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- 50శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య
- ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ

50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది.



# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

- ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు
- లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



# వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

- వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా ?
- చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం సమంజసమా
- చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరం
- ఇలాంటి వాటిని తొలగించండి..భవిష్యత్‌లో పెట్టకండి
- లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని సిపి సజ్జన్నార్ హెచ్చరిక



# ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

- ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో సాగాలి
- డ్రోన్ టెక్నాలజీలో కర్నూలుకు స్థానం
- గూగుల్ రాకతో విశాఖ దశ మారతుంది
- రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌ల విజనరీ నాయకత్వం
- కర్నూలు సభలో ప్రధాని మోడీ ప్రసంగం

కర్నూలు: జివెస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతోందని, అయితే అది ఓకల్ ఫర్ లోకల్ కావాలని ప్రధాని మోడీ అభిలషించారు. డ్రోన్ టెక్నాలజీకి కర్నూలు కేంద్రం కాబోతోందన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. అందులో దేశీయ టెక్నాలజీ అద్భుతంగా పనిచేసిందన్నారు. ఇది మన ఆత్మనిర్భరతకు గర్వకారణమన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉంది. అహోబిలం నర్సింహస్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నా. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నా. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన గుజరాత్‌లో నేను జన్మించాను. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించింది. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉంది.



# నేడు ఆశన్న లొంగుబాటు!

**హైదరాబాద్** :దేశంలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో మరో అతిపెద్ద లొంగుబాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ 60 మంది సహచరులతో మహారాష్ట్ర సీఎం ఎదుట బుధవారం లొంగిపోయిన విషయం తెలిసిందే. మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పుర్‌లో ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయి, హెూంమంత్రి విజయ్‌శర్మ ఎదుట శుక్రవారం మరో 200 మంది లొంగిపోయేలా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీరిలో మాడ్ డివిజన్‌కు చెందిన దాదాపు 100 మంది ఉన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రూపేశ్ ఎలియాస్ ఆశన్న, మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత, ఇద్దరు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, 15 మంది డివిజనల్ కమిటీ సభ్యులు గురువారం ఇంద్రావతి నది దాటి బైరాంగఢ్‌కు తరలివచ్చారు. పదుల సంఖ్యలో మావోయిస్టులు నదిని దాటుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీరిని జగదల్‌పుర్ తరలించేందుకు పోలీసులు నాలుగు బస్సుల్ని ఏర్పాటు చేశారు. మరోవైపు బుధవారమే ఛత్తీస్‌గఢ్ కాంకేర్‌లోని కామ్‌తేరా బీఎస్‌ఎఫ్ క్యాంపునకు చేరుకున్న మావోయిస్టు కేడర్ సైతం వీరితో జత కలిసింది. గురువారం రాత్రి 200 మందితో కూడిన ఈ బృందం జగదల్‌పుర్‌కు చేరుకుంది.

## జోర్డాన్ బాధితులొస్తున్నారు..

# అధైర్యపడొద్దు



**హైదరాబాద్:** జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాణ గల్ఫ్ కార్మికులు ఈ నెల 23న హైదరాబాద్‌కు చేరుకుంటారని, ఎవరూ అధైర్యపడొద్దని వారి కుటుంబసభ్యులకు భారాస మాజీ మంత్రి టి.హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. జోర్డాన్ బాధిత కుటుంబసభ్యులతో గురువారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 'జోర్డాన్‌లో చిక్కుకున్న తెలంగాణ కార్మికుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల దృష్టికి తీసుకెళ్లాం. భారాస రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి భారత విదేశీ వ్యవహారాలశాఖ అధికారులతో మాట్లాడారు. మరోవైపు సంబంధిత కంపెనీ ప్రతినిధులతోనూ చర్చలు జరపగా పెనాల్టీ చెల్లించి వారిని తెలంగాణకు తీసుకెళ్లడానికి అంగీకరించింది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం: ఆర్ఎస్ ప్రవీణ్ రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తమైందని, కమీషన్ల కోసం మంత్రులు ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'నిన్న రాత్రి నుంచి హైదరాబాద్‌లో హైడ్రామా నడుస్తోంది. మంత్రి నివాసం నుంచి నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బయటకు తీసుకురాలేక పోయారు.

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

న్యూఢిల్లీ: మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు.

లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

# వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

హైదరాబాద్: వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూ ట్యూబర్లను ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీశారు. చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది. మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం అని కూడా హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటో చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

# బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట




న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్‌-ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా

తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను

సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

# బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

న్యాయనిపుణులతో చర్చించి ముందుకు

స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత

కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు

మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్‌కమిటీ

డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు

తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయలు...హాజరు కాని కొండా సురేఖ

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్లాలని కేబినేట్‌లో నిర్ణయించారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీచేయకుండా తీసుకున్న నిర్ణయాన్ని ఎత్తివేస్తూ కేబినేట్ ఆమోదించింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినేట్‌లోకీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నందున డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, రైతు భరోసా, మైనింగ్ కొత్త పాలసీ, మెట్రో ఫేజ్-2 టెండర్లపై చర్చించారు. మెట్రో ఫేజ్-2పై సమావేశంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సిఎస్ అధ్యక్షతన కేబినేట్ సబ్‌కమిటీ వేశారు. అయితే, కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆగ్రహంగా ఉన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, జయశంకర్ వర్సిటీకి మూడు కొత్త వ్యవసాయ కళాశాలలకు కేబినేట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే,ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.10,500 కోట్లతో నిర్మించే 5500 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదించింది. త్వరలో టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు. వరి రికార్డు స్థాయిలో పండిందని, దానిని పూర్తిగా కొనుగోలు చేస్తామని అన్నారు.

'రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# బంద్‌తోనే "పోరాటం" ఆగదు.



నిజామాబాద్, వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:




## మేమెంతో మాకంతా ఇవ్వాల్సిందే.

## 42శాతం రిజర్వేషన్లు సాధిస్తాం.

**బీసీలు భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉద్యమించాలి.**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ బీసీ జేఏసీ కో-చైర్మన్ కెంపుల నాగరాజు.**

"బీసీలకు రాజ్యాంగబద్ధమైన న్యాయం సాధించేందుకు, తెలంగాణ రాష్ట్ర బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా బీసీ బంద్ జరగనుంది. ఈ నేపథ్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, తెలంగాణ బీసీ జేఏసీ కో-చైర్మన్ కెంపుల నాగరాజుతో "వేగుచుక్క" ముఖాముఖి."

**ప్రశ్న: ఈనెల 18న జరగనున్న "బీసీ బంద్" వెనుక ఉద్దేశం ఏమిటి?**

కె. నాగరాజు:

ఈ బంద్ యొక్క ప్రధాన ఉద్దేశం "జస్టిస్ ఫర్ బీసీస్" అంటే బీసీలకు సముచిత హక్కులు, రిజర్వేషన్లు మరియు రాజకీయ భాగస్వామ్యం రావడం. తెలంగాణలో బీసీల జనాభా అధికారికంగా 56 శాతం ఉన్నా, వారికి ఇచ్చిన రిజర్వేషన్లు ఇందులో సగమే. జనాభా దామాషా పరంగా ఇవి సరిపోవు. అందుకే బీసీ జేఏసీ రాష్ట్రవ్యాప్తంగా ఒకే గొంతుతో బీసీల న్యాయం కోసం ఈ బంద్‌కి పిలుపునిచ్చింది.

**ప్రశ్న: నిజామాబాద్ జిల్లాలో బంద్‌కు ఎలాంటి మద్దతు లభిస్తుంది.**

కె. నాగరాజు:

నిజామాబాద్ జిల్లాలో ప్రతి కుల సంఘం, ప్రజా సంఘం, వాణిజ్య సముదాయాలు, రాజకీయ పార్టీలు ఈ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. మేము జిల్లాలోని అన్ని సంఘాల ప్రతినిధులను కలసి, బీసీ హక్కుల అవసరాన్ని వివరించాము. వారు స్వచ్ఛందంగా మద్దతు పత్రాలు ఇచ్చారు.

వర్తక, వ్యాపార వర్గాలు కూడా బంద్ రోజు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసివేయనున్నాయి. ఇటీవల ప్రచార కార్యక్రమంలో బంద్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ప్రజలలో ఉత్సాహం కనిపిస్తోంది.

**ప్రశ్న: బీసీల రిజర్వేషన్లపై జీఓ 9, దానిపై కోర్టు స్టే నేపథ్యంలో మీరు ఎలా చూస్తున్నారు?**

కె. నాగరాజు:

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల కోసం జీఓ 9 విడుదల చేసింది. ఇది బీసీల చరిత్రలో పెద్ద అడుగు. కానీ కొందరు వ్యతిరేక శక్తులు హైకోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకున్నారు.

దీనిని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళింది. కానీ అక్కడ కూడా న్యాయం జరగలేదు.

**ప్రశ్న: బీసీ బంద్ విజయవంతంకు చర్యలు ఏమిటి.**

కె. నాగరాజు:

ఖచ్చితంగా బీసీ బంద్ చరిత్రాత్మకంగా నిలుస్తుంది. ఇది రాజకీయ ఉద్యమం కాదు, సామాజిక న్యాయం కోసం సమాజం మొత్తం చేసే కదలిక. అన్ని వర్గాల మద్దతుతో బంద్ శాంతియుతంగా, విజయవంతంగా జరుగుతుంది.

**ప్రశ్న: బంద్ తర్వాత బీసీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ ఏమిటి?**

కె. నాగరాజు:

అవును. బంద్ విజయవంతం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బీసీ అవగాహన సమావేశాలు, యువజన సదస్సులు, మహిళా బీసీ సమావేశాలు నిర్వహిస్తాము. తద్వారా బీసీల ఐక్యతను బలోపేతం చేసి, విద్యా%-%ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుంది.

**ప్రశ్న: ప్రజలకు మీ సందేశం ఏమిటి?**

కె. నాగరాజు: ప్రతి బీసీ కుటుంబం ఈ బంద్‌లో భాగం కావాలి. బీసీలకు న్యాయం జరగాలంటే అందరూ కలిసి ఉద్యమించాలి. మన హక్కుల కోసం మనమే ముందుకు రావాలి. అక్టోబర్ 18న బీసీ బంద్‌ను పూర్తిగా విజయవంతం చేసి చరిత్ర సృష్టిద్దాం.

-....... ప్రత్యేక ప్రతినిధి, వెంకటేష్, వేగుచుక్క న్యూస్.

# తాయిలాలకు లొంగితే అంతే సంగతులు !

ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు. బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతుకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహార్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్ధకం గా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు.

# దేశాయి "దోపిడీ"పై పెల్లుబికిన ఆగ్రహం.



**బీడీ కంపెనీ రీజినల్ కార్యాలయం ముట్టడి, ఉద్రిక్తత.**

**వెయ్యి బీడీలకు రూ" 10 చొప్పున, ఏడాదికి రూ" 210 కోట్ల నిలువు దోపిడి.**

**తెలంగాణ ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్(టియుసిఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ వెల్లడి.**

**దశలవారీగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

దేశాయి బీడీ కంపెనీ "దోపిడీ"పై కార్మికుల ఆగ్రహం పెల్లుబికింది. వెయ్యి బీడీలకు రూ" 10 చొప్పున అక్రమంగా వసూలు చేస్తూ, ఏడాదికి రూ" 210 కోట్ల నిలువు దోపిడి చేస్తుందని తెలంగాణ ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్(టియుసిఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆర్మూర్ లోని కుమార్ నారాయణ భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి దేశాయ్ బ్రదర్స్ రీజినల్ కార్యాలయం ముట్టడించారు. దీనితో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ మాట్లాడుతూ, కంపెనీ యాజమాన్యం
బీడీ కార్మికుల వద్ద రోజు వారిగా అజర్ బీడీలకు రూ" 10 చొప్పున, సంవత్సరంకు రూ" 210 కోట్ల డబ్బుల్ని నిలువుదోపిడీ చేస్తుందని ఆరోపించారు. చట్టానికి దొరకకుండా పూర్తి కూలి చెల్లిస్తున్నట్టు చూపిస్తూ, లేబర్ అధికారులనీ నమ్మిస్తూ, కార్మికులను లూటీ చేస్తున్నారని అన్నారు. అలాగే ముడిసరుకులు అందించే విషయంలో కూడా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వేయి బీడీలకు నాసిరకం ఆకువల్ల కార్మికులు తుట్టి నింపాల్సి వస్తుందని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారనీ అన్నారు. ఏ రంగంలో లేనివిధంగా బీడి రంగంలోనే తక్కువ పద్ద ముడి సరుకుల భర్తీ కార్మికులు చేయాల్సి వస్తుందని, కార్మికులను దోచుకోవడం లక్ష్యంగా యజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. దీనికి తోడుగా బీడీ కార్మికులకు బలవంతంగా పితారా పేరుతో నాసిరకం తిను బండారాలను అంటగట్టి, చట్ట విరుద్ధ వ్యాపారం చేస్తుందన్నారు. యాజమాన్యం అందించే తునికి ఆకు అసలు ముక్కిపోయి, ఖరాబ్ అయినది



వేయడం వల్ల కార్మికులు చాలా నష్టపోతున్నారనీ అన్నారు. తమ దోపిడిని కప్పి పెట్టుకోవడానికి యజమాన్యం ఆందోళనలు చేయకుండా కార్మికులను బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే, యాజమాన్యం తమ దోపిడీ పద్ధతిని మార్చుకోకుంటే ఆయా గ్రామాల్లో ఎక్కడికి అక్కడ బుద్ది చెప్పాల్సి వస్తుంది ఆయన హెచ్చరించారు.

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ మాట్లాడుతూ,**

దేశాయి బీడీ కంపెనీ తక్షణం తమ దోపిడి పద్ధతులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఏళ్ల తరబడి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయలను కార్మికులకు ఇవ్వాలని అన్నారు. లేబర్ అధికారులు కంపెనీ యాజమాన్యం చెప్పింది నమ్మకుండా, గ్రామ స్థాయిలో కార్మికుల నుండి వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. కంపెనీ విధానాలపై చట్టంబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భీడివర్కర్స్ యూనియన్ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం. ముత్తేన్న, ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ లు ప్రసంగించగా,
జిల్లా ఉపాధ్యక్షులు వి. సత్తేవ్వ, కె. రాజేశ్వర్, ఎ. ప్రకాష్, కార్యదర్శి ఎం. అనిస్, కోశాధికారి అరవింద్, నాయకులు ఎండి.నశిర్, టీ.శ్రీను ,
సీపీఐ(ఎం. ఎల్) మాస్ లైన్ నాయకులు బి. కిషన్, ఆర్. దామోదర్, పి. రమ, ఆర్. పుష్పలత, జి పద్మ, ఎ.లక్ష్మి, ఎస్.సునీత, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి.

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 16**



: ఆకస్మిక గుండె పోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగహన అవసరమని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఐడిఓసి సమావేశ మందిరంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సిపిఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్) అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రజా జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణా పాయ స్థితి నుంచి బయట పడతారన్నారు. ఓ వ్యక్తికి ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ వచ్చినప్పుడు, వైద్య సహాయం అందేలోపు ఛాతీని 30 సార్లు నొక్కి, 2 శ్వాసలు ఇవ్వడం (30:2 రేషియో) ద్వారా గుండెను సాధారణ స్థితికి తీసుకు రావచ్చని తెలిపారు. కార్డియాక్ హెల్త్ కేర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు జిల్లాలో సిపిఆర్ పై ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విధానంపై గ్రామాల నుంచి పట్టణాల దాకా అందరిలోనూ అవగాహన పెంచేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సిపిఆర్ ఎలా చేయాలన్న దానిపై మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ వెంకటేష్, వేణుగోపాల్ ప్రయోగపూర్వకంగా తెలియజేశారు.అవగాహన కార్యక్రమంలో ఎంపిడిఓలు, హౌసింగ్ ఎఈలు, పంచాయతి సెక్రెటరీలతో సిపిఆర్ ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ రాజశ్రీ, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, డిప్యూటీ సీఈఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాక్లూర్ పాఠశాలకు రూ. కోటి విరాళం అందించిన మాజీ ఎమ్మెల్యే బిగాల.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 16**



: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. కోటి విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన తన సోదరుడు బిగాల మహేష్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి వచ్చి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి కోటి రూపాయల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.

## సిపిఆర్ పై వాకర్స్‌కు అవగాహన.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



నగరంలోని వినాయక్ నగర్ లో గల తెలంగాణ అమర వీరుల పార్క్ లో కేంద్ర ఆరోగ్య శాఖ పిలుపు మేరకు గురువారం వాకర్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ విభాగంకు చెందిన సీనియర్ డాక్టర్ టి. అరవింద్ సిపిఆర్ చేయు విధానం వివరించారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వ్యక్తికి ప్రక్కన ఉన్నవారు సరైన విధానంలో సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాన్ని కాపాడవచ్చని, డెమో ద్వారా వివరించారు.

# బీసీ బంద్‌కు అఖిలపక్ష పార్టీల మద్దతు.

**ప్రజా సంఘాలు, డాక్టర్లు, న్యాయవాదులు, జర్నలిస్టుల మద్దతు.**

**బీసీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి పెద్ద ఎత్తున హాజరు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**




తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 18న తలపెట్టిన బిసి బంద్ కు కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్, టిడిపి, సీపీఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎమ్ఐఎం పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అలాగే కుల సంఘాలు, ప్రజాసంఘాలు, డాక్టర్లు, లాయర్లు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, బీసీ సంఘాలు, గంజి వర్తక సంఘం, దద్వాయి సంఘం, మర్చంట్ అసోసియేషన్ అసోసియేషన్, సిల్వర్ అండ్ గోల్డ్ మర్చంట్ అసోసియేషన్, బట్టల దుకాణాల అసోసియేషన్, విద్యాసంస్థలు, విద్యార్థి సంఘాలు, కిరాణా దుకాణం అసోసియేషన్ అన్ని మూకుమ్మడిగా బిసి బంద్ కు సంగీభావం ప్రకటించాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గీతా భవన్ లో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని వర్గాలకు చెందిన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు నాయకులు మాట్లాడుతూ, ప్రత్యక్షంగా బంద్ లో పాల్గొంటామని బీసీ జేఏసీకి హామీ ఇచ్చాయి. బీసీలకు 42 శాతం అమలు జరిగే వరకూ శాంతియుతంగా ఉద్యమం చేస్తామని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం లోను, తెలంగాణ ఉద్యమ సమయం లోనే గాక నేటి వరకు ప్రతి సందర్భంలోనూ బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఏకరువు పెట్టారు. సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ను ఎలా కల్పించారో అదే పద్ధతిలో బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా పద్ధతిలో బీసీలకు 60 శాతం వాటా దక్కవలసిందేనని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను తేల్చి చెప్పారు.

**ఈడబ్ల్యూఎస్ లో వర్గీకరణ చేయాలి.**

ఈడబ్ల్యూఎస్ ఎవరు అడగకున్నా 10 శాతం రిజర్వేషన్ అమలు చేశారని, బీసీలు రిజర్వేషన్ పెంపును కోరుతున్న రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. తమ బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నందుకు బదులుగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో వర్గీకరణ జరగాల్సిందేనని, తాము సైతం కోర్టుకు పోతామని హెచ్చరించారు.

**ఈడబ్ల్యూఎస్ 10 శాతం కోటా ఎక్కడిది.**

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాలో ఉన్న పది శాతం ఎవరిదని ప్రశ్నించారు. ఆది జనరల్ కోట నుండి ఇచ్చారని, ఆ జెనరల్ కోటాలో బహుజనల వాటా తొమ్మిది శాతం ఉందని స్పష్టం చేశారు. ఆ ఈడబ్ల్యూఎస్ 9 శాతం వాటాను బహుజనులకు పంచాల్సిందేనని తేల్చిచెప్పారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కు రిజర్వేషన్ ఇవ్వడం వల్ల జనరల్ కోటాలో తమ బహుజనులు 9 శాతం వాటా కోల్పోతున్నారని పెర్కోన్నారు. ఈ వాటా బహుజనులది కాదు అనే దమ్ము ఎవరికైనా ఉందా అని సవాల్ విసిరారు. జనరల్ కోట 50 శాతం నుండి 40 శాతం తగ్గించడం బహుజనుల హక్కులను కాలరాయడం కాదా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ చైర్మన్ పోతనకర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ బొబ్బిలి నరసయ్య, టిఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్రావు , కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి సుధాకర్, బిసి రాజ్యాధికార పార్టీ నాయకులు గంగాధర్, ఎంఐఎం నాయకులు పాష, డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ విశాల్, బార్ అసోసియేషన్ నాయకులు శ్యామ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఎనగందుల మురళి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బైర శేఖర్, జర్నలిస్ట్ ఫోరం నాయకులు జమాల్పూర్ గణేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాకాల నర్సింలు, గాయత్రి విశ్వకర్మ వడ్రంగి సంఘం అధ్యక్షులు కే సంజీవ్, బీసీ మహాసభ జిల్లా అధ్యక్షులు ఆదే ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘన్పూర్ కళాశాల వరకు ఆర్టీసీ బస్సు నడపాలి.

**- పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**




జిల్లా కేంద్రం నుంచి బోర్గాం, మోపాల్, కులాస్ పూర్, ముల్లంగి మీదుగా ఘన్ పూర్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ నగరంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, రీజినల్ మేనేజర్ టి .జోష్న కు పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం అందించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, నిజామాబాద్ నుండి మోపాల్, కులాస్ పూర్, కులాస్ పూర్ తండా, ముల్లంగి నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు డిచ్ పల్లి మండలం ఘ న్ పూర్ లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారని, నిజామాబాద్ నుంచి వచ్చే బస్సు ముల్లంగి వరకే నడుపుతున్నారని, ముల్లంగి నుండి జూనియర్ కళాశాల వరకు రెండు కిలోమీటర్ల పైగా నడిచి వెళ్లడం జరుగుతుందని, విద్యార్థులు ఉదయం పూట క్లాసులు కోల్పోతున్నారని, మరియు అదనపు ఆర్థిక భారం విద్యార్థులు భరిస్తున్నారని అన్నారు. సాయంత్రం వేళల్లో కూడా ముల్లంగి వరకు నడిచి వెళ్తున్నారని , అమ్మాయిలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో ఎన్ని సార్లు విన్నవించిన విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడంలేదని కావున ముల్లంగి వరకే కాకుండా ఉదయం సాయంత్రం ఘన్పూర్ జూనియర్ కళాశాల వరకు వరకు బస్సు నడపాలని డిమాండ్ చేశారు. రీజినల్ మేనేజర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నగర నాయకులు సాయికిరణ్, ప్రసాద్, ప్రసాద్, ఇస్మాయిల్, పవన్, వినీల్, శ్రవణ్, యశ్వంత్, సాయి కుమార్, రోహన్, భాను, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.




## 18న బీసీ బంద్ విజయవంతం చేయాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

బీసీ రిజర్వేషన్లకు పార్లమెంటులో చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం అడ్డు పడుతుందని ఆయన విమర్శించారు. ఈనెల 18న జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతం చేయాలని కోరారు.

# పాక్‌తో చెలిమి కోసం ట్రంప్ ఆరాటం

**భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు**

**అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ వ్యాఖ్యలు**




వాషింగ్టన్: పాక్‌తో చెలిమి కోసమే ట్రంప్ ఆరాటం అని, అందుకు భారత్‌తో చెలిమిని వదులుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులు కుంటున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోందని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

వేగుచుక్క



## రష్మిక మైసా సంగీత దర్శకుడుగా
# జేక్స్ బిజోయ్

నేషనల్ క్రష్ రశ్మిక మందన  నటిస్తున్న పవర్ ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా'  ఈ సినిమాతో రవీంద్ర పుల్లె  డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో పాన్-ఇండియా స్థాయిలో 'మైసా' సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. నాని నటించిన 'సరిపోదా శనివారం'  చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ను 'మైసా' చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ సౌండింగ్ అదిరిపోయింది. 'మైసా' మ్యూజికల్ గా గ్రాండ్ స్కేల్ లో వుండబోతుందని ఈ వీడియో చూస్తే అర్థమౌతోంది. 'మైసా' గోండు తెగల బ్యాక్ డ్రాప్ లో హై-ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతోంది. రశ్మిక మందణ్ణ ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించనుంది. ఈ సినిమాకు సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ ని 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ అండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.




# సక్సెస్‌కు రవితేజ ఎదురుచూపు

31న వస్తున్న మాస్ జాతర మాస్ మహరాజా రవితేజ కు సాలిడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా'తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలగ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.

## వెట్రిమారన్ తెలుగు
# సామ్రాజ్యం
### ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల





తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు. ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి.



## కాంతారా చాప్టర్ 1కు
# దీపావళి వెలుగులు

హిట్ మూవీ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా తెరకెక్కి ఆ చిత్రానికి మించిన విజయం అందుకుంది 'కాంతార చాప్టర్  అక్టోబరు 2న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా 12 రోజుల్లో రూ.675 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. దీపావళిని పురస్కరించుకుని కొత్త ట్రైలర్ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలతో రూపొందించిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటించిన సంగతి తెలిసిందే.

## పెద్ది నుంచి త్వరలో
# లవ్ సాంగ్




దర్శకుడు బుచ్చిబాబు సానా రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా  కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది.  ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది.  దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు.

# వరుస సినిమాలతో అనుపమ దూకుడు



మరో రెండు సినిమాల విడుదల మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన 'డ్రాగన్'  మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది.అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో 'సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో 'రాక్షసుడు' మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'బైసన్' తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న  విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను ందిస్తుందేమో చూడాలి.



# రూ.60 కోట్లు డిపాజిట్ చేయమన్న కోర్టు..
## శిల్పాశెట్టి దంపతుల పిటిషన్ విత్‌డ్రా



విదేశీ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ శిల్పాశెట్టి దంపతులు బాంబే హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పిటిషన్‌ను వారు విత్‌డ్రా చేసుకున్నారు. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో శిల్పాశెట్టి, ఆమె భర్త రాజ్‌కుంద్రా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరికి ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం లుకౌట్ నోటీసులు (ఎల్‌వోసీ) కూడా జారీ చేసింది. దాన్ని కొట్టివేయాలని కోరుతూ.. వృత్తిపరంగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ
కొన్ని రోజుల క్రితం పిటిషన్ దాఖలు చేయగా కోర్టు తిరస్కరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలంటే ముందు రూ.60 కోట్లు డిపాజిట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ క్రమంలో విత్‌డ్రా చేసుకున్నారు.